సాక్షి
మంచిర్యాల
గురువారం । 9 । మార్చి । 2023



ఉత్తమ ఫలితాల కోసం..
గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రత్యేకంగా రూపొందించిన అభ్యాస దీపికలు అందజేస్తోంది. 8లో ▸



హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక
హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలలోబుధవారం హ్యాండ్‌బాల్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.0 /20.0
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మహిళల సంక్షేమానికి పెద్దపీట



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: బీఆర్ఎస్ పాలనలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. బుధవారం జన్నారంలో ఏర్పాటు చేసిన మహిళ ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం షీ టీంలు ఏర్పాటు చేసిందని, మహిళల రక్షణకు అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళలపై కేసుల పెడుతూ వేధిస్తోందని ఆరోపించారు. మహిళలు సొంత కాళ్లపై నిలబడేందుకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. వైద్యురాలు, సిబ్బందితో కలిసి కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీ ఖాన్, జన్నారం ఎంపీటీసీ రియాజొద్దీన్, వైద్యాధికారి ఉమశ్రీ, మహిళా బీఆర్ఎస్ అధ్యక్షురాలు సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

రామకృష్ణాపూర్: ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తిమ్మాపూర్‌లోని భీమా గార్డెన్స్‌లో బుధవారం వడ్డీలేని రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు తీసుకున్న వారు వృథా ఖర్చులకు పోకుండా సరైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారు ఆర్థికంగా చక్కటి అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాలో విఫలం



ఎండిన పొలాలను పరిశీలిస్తున్న మల్లారెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సాగునీటి సరఫరాలో మంచిర్యాల ఎమ్మెల్యే విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముల్కల్ల మల్లారెడ్డి విమర్శించారు. బుధవారం హాజీపూర్ మండలం నర్సింగాపూర్ శివారులో ఎండిన వరి పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. పంటలు ఎండిన రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ ఓ వైపు గోదావరి, మరోవైపు ఎల్లంపల్లి, కడెం ప్రాజెక్ట్‌ల కాలువలతోపాటు గూడెం లిఫ్ట్ ఉన్నా రైతులకు సాగునీరు అందడంలో ఎలాంటి న్యాయం జరగడం లేదని అన్నారు. కడెం కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే వనరులు పుష్కలంగా ఉన్నా చొరవ చూపడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తులా మధుసూదన్‌రావు, హాజీపూర్ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, ప్రధాన కార్యదర్శి మడిపెల్లి సత్యం, నాయకులు లింగన్నపేట విజయ్‌కుమార్, మారు గంగారెడ్డి, ప్రదీప్‌చంద్ర పాల్గొన్నారు.

కళాక్షేత్ర విద్యార్థులకు భారత నాట్యకీర్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న నర్మదగౌడ్

జన్నారం: ఆంధ్రప్రదేశ్‌లోని సింహచలం లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం వద్ద నిర్వహించిన నృత్య పోటీల్లో జన్నారం మండలం పొనకల్ నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కామారెడ్డికి చెందిన సనాతన సాంస్కృతిక సంస్థ అన్నవరానికి చెందిన కావ్యశ్రీ నృత్య కళాశాల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. నిర్వాహకులు జాతీయ భారత నాట్యకీర్తి అవార్డుతో మాస్టర్ నర్మదగౌడ్‌ను సత్కరించారు. విద్యార్థులకు అభినందన పత్రాలు అందజేశారు.

ముహూర్తమెప్పుడో..!

- ఐదేళ్లుగా సా..గుతున్న కలెక్టరేట్ నిర్మాణం
- త్వరలోనే ప్రారంభం అంటూ ఊరింపు
- అరకొర వసతులతో సాగుతున్న పాలన



నస్పూర్‌లో నిర్మించిన నూతన జిల్లా సమీకృత కార్యాలయ భవనం



కాన్ఫరెన్స్ హాల్‌లో పూర్తికాని విద్యుదీకరణ పనులు



కలెక్టరేట్‌కు వెళ్లేదారి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ నిర్మాణం పనులు ఐదేళ్లుగా సా..గుతూనే ఉన్నాయి. ఇంకా పనులు పూర్తి కాకపోవడంతో ప్రారంభోత్సవంపై ముహూర్తం కుదరడం కుదరడం లేదు. మార్చి 15లోపు పూర్తి పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఇటీవల జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు కాంట్రాక్టర్‌కు గడువు విధించారు. అయినా ఆలోపు అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వచ్చే నెలలోనైనా పనులు పూర్తవుతాయా లేదా అని చెప్పలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఇప్పటికే కొత్త సమీకృత కలెక్టరేట్లు అందుబాటులోకి వచ్చాయి. పొరుగు జిల్లా పెద్దపల్లిలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లాలో గత డిసెంబర్‌లో కలెక్టరేట్ పరిధిలో క్యాంపు కార్యాలయం ప్రారంభించి అక్కడే నివాసం ఉంటున్నారు. సమీకృత భవనం సైతం వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు పలుమార్లు కలెక్టర్ పనుల పురోగతి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. పనుల వేగం పెంచేందుకు అధికారులు, కాంట్రాక్టర్‌తో సమీక్షలు చేస్తున్నారు. ఈ ఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ప్రధాన కార్యాలయాలైనా అందుబాటులోకి తేవాలని ఒత్తిడి తెస్తున్నారు.

కార్యాలయాల్లో అరకొర వసతులు

జిల్లా ఆవిర్భావం నుంచి శాశ్వత కలెక్టరేట్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల జిల్లా అధికారులు, కింది స్థాయి అధికారులకు సరైన వసతులు, సౌకర్యాలు లేక.. ఇటు ప్రజలు అరకొర సౌకర్యాలతో నెట్టుకొస్తున్నారు. జిల్లా కార్యాలయాలు మంచిర్యాల, శివార్లలో ఒక్కో చోట ఉన్నాయి. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె చెల్లిస్తూ ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇక ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలతో వచ్చే ఫిర్యాదుదారులు వందలాది మంది కనీసం నిల్చునేందుకు నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు కనీసం కూర్చునేందుకు స్థలం లేకుండా ఉంది. ఇక అధికారులకు సమీక్షలు, సమావేశాల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. 2018 ఫిబ్రవరి 27న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కలెక్టరేట్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. అప్పటి నుంచి ప్రారంభమైన పనులు నేటికీ కొనసా..గుతూనే ఉన్నాయి. స్థల సేకరణతో మొదలైన జాప్యం నేటికీ కొనసాగుతోంది. నస్పూర్ శివారులో సర్వే నంబరు 42లోని 26.27 ఎకరాల్లో రూ.41.54 కోట్లతో నిర్మించాలని తలచారు. మూడు అంతస్తుల్లో భవన సముదాయాలు అన్నీ కలిపి లక్షా 30వేల చదరపు అడుగుల్లో అన్ని రకాల వసతులు కల్పించాల్సి ఉంది. రెండేళ్లు కరోనా కారణంగా జాప్యం కాగా.. కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులతోనూ జాప్యం ఏర్పడింది. దీంతో ఇప్పటికే కాంట్రాక్టర్‌కు నాలుగుసార్లు గడువు పెంచారు. ప్రస్తుతం అండర్ డ్రెయినేజీ, విద్యుద్దీకరణ, ఇంటీరియర్, సానిటరి, మరుగుదొడ్లు, ఇతర చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. కలెక్టరేట్ పనులపై ఆర్‌అండ్‌బీ ఈఈ రాము స్పందిస్తూ వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

మహిళలను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



ట్రైనీ కలెక్టర్ గౌతమిని సన్మానిస్తున్న మహిళలు

మంచిర్యాలటౌన్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని, వారిని మరింతగా ప్రోత్సహించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి మైనార్టీ ఫంక్షన్ హాల్ వరకు మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆత్మస్థైర్యమే గొప్ప ఆయుధమని, అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఆదర్శంగా తీసుకుని గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వడ్డీ లేని రుణాలతో మహిళలకు అండగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లోని మహిళా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు, అంగన్‌వాడీ ఉద్యోగుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ సేవలు అందిస్తున్న హాజీపూర్ మండలం గుడిపేట సర్పంచ్ ఎల్.లక్ష్మీ, నెన్నెల మండలం గొల్లపల్లి సర్పంచ్ ఇందూరి శశికళ, కన్నెపల్లి మండలం జన్కాపూర్ సర్పంచ్ ఎస్.వసంతలను సత్కరించి, ప్రశంసాపత్రం అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, అత్తి సరోజ పాల్గొన్నారు.

కిడ్నీలు ఫైలం!

ఇటీవల ఓ యువకుడు రెండు కిడ్నీలు దెబ్బతిని ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. కల్తీ నమిలే అలవాటు మూత్రపిండాలపై ప్రభావం చూపినట్లు వైద్యులు గుర్తించారు. జిల్లాలో మారుతున్న జీవన శైలీ, ఆహారపు అలవాట్లతో అనేకమంది మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. ఏటేటా కిడ్నీ బాధితులు పెరుగుతున్నారు. గత మూడేళ్లలోనే వ్యాధిగ్రస్తుల సంఖ్య రెట్టింపు అయింది. జిల్లా వైద్యారోగ్యశాఖ లెక్కల పరిధిలోకి రాని వాళ్లు, ప్రైవేటులో చికిత్స పొందుతున్న వారు లేకపోలేదు. నేడు 'ప్రపంచ కిడ్నీ దినోత్సవం' నేపథ్యంలో మూత్రపిండాలపై జాగ్రత్తలు తెలుసుకోవాల్సి ఉంది.



బెల్లంపల్లిలో డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, ఐకే రెడ్డి(ఫైల్)

- జిల్లాలో పెరుగుతున్న మూత్రపిండ వ్యాధిగ్రస్తులు
- గత మూడేళ్లలో రెట్టింపైన రోగులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు

సంవత్సరం	వ్యాధిగ్రస్తులు
2020–21	7,079
2021–22	11,794
2022–23	13,366

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మూత్రపిండాల వ్యాధితో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. జిల్లాలో ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పది పడకలతో ఉన్న డయాలసిస్ కేంద్రానికి రోగులు వస్తున్నారు. ఇటీవల బెల్లంపల్లి పట్టణంలోనూ డయాలసిస్ కేంద్రం ఐదు పడకలతో అందుబాటులోకి తెచ్చారు. జిల్లాతోపాటు కుమురంభీం జిల్లా, సిరొంచా తదితర ప్రాంతాల నుంచి బాధితులు వస్తున్నారు. మూత్రపిండాలు పని చేయడం మానేయడంతో నిత్యం రోగులు రక్తశుద్ధి కోసం డయాలసిస్‌పై ఆధారపడాల్సి వస్తోంది. వీటితోపాటు కిడ్నీల్లో రాళ్లతోనూ ఇబ్బందులు పడుతున్నారు.

అదుపు తప్పుతున్న రక్తహీనత, చక్కెర

జిల్లాలో ఇటీవల కాలంలో వయస్సు పైబడిన వారితోపాటు యువకుల్లోనూ మూత్రపిండాల వ్యాధి బాధితులు ఉన్నట్లుగా చెబుతున్నారు. ముఖ్యంగా రక్తపోటు(బీపీ) పెరగడం, రక్తంలో చక్కెర స్థాయి(మధుమేహం) ప్రధాన సమస్యగా ఉందంటున్నారు. అలాగే కొందరు యువత కల్ర నమలడం, ఉప్పు అధికంగా వాడడం, పొగ తాగడం, జీవన శైలీ మార్పులతో జిల్లా పరిధిలో రోగులు పెరుగుతున్నారని వివరిస్తున్నారు. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. చాలామంది శరీరానికి సరిపడా నీరు తాగకపోవడంతో ఎక్కువ మందిలో మూత్రపిండాల్లో రాళ్ల సమస్యగా కనిపిస్తున్నాయి.

జీవన శైలీ మార్పుతో ప్రభావం



జిల్లాలో కొందరు యువత కల్ర నమలడం, పొగతాగడం, బీపీ అదుపు లేక మూత్రపిండాల సమస్యలు వస్తున్నాయి. కొందరిలో షుగర్‌తోనూ ప్రభావం చూపుతోంది. మారుతున్న జీవన శైలీ కిడ్నీలపై పడుతోంది. ఉప్పు తగ్గించి వాడడం, తగినంత నీరు తాగడం, పోషకాహారం తీసుకుని, శరీర బరువు, గుండె పనితీరును అదుపులో ఉంచుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే జాప్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.
– డాక్టర్ రాకేశ్ చెన్న
నెఫ్రాలాజిస్టు,మంచిర్యాల

జాగ్రత్తలు పాటిస్తే మేలు..

కిడ్నీలు మానవ శరీరంలో మలినాలను ఎప్పటికప్పు డు శుభ్రపరస్తూ, రక్తాన్ని శుద్ధి చేస్తాయి. ఈ వ్యాధిగ్రస్తులకు ప్రధానంగా ఉన్న బీపీ, షుగర్, బరువు అదుపులో ఉంటే చాలా వరకు తీవ్రత తగ్గించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. వీటికి తోడు గుండె పనితీ రు, నొప్పుల మాత్రలు విపరీతంగా వాడితే కిడ్నీల పై ప్రభావం ఉంటుందని వివరిస్తున్నారు. ఈ వ్యాధి పలు రకాలు, దశల్లో ఉంటుంది. పూర్తిగా కిడ్నీలు పని చేయకపోతేనే కృత్రిమంగా రక్తాన్ని శుద్ధి చేస్తూ రోగులకు ఉపశమనం కలిగిస్తారు. మూత్రపిండాల వైఫల్యం, కిడ్నీలకు గాయాలైనప్పుడు సైతం సమస్యలు వస్తాయి. ఇలాంటి పరిస్థితులు రాకుండా జా గ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

నేటి సదరం క్యాంపు వాయిదా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించాల్సిన సదరం శిబిరం వాయిదా వేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి బి.శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి, చెవుడు లోపాలు కలిగిన వారికి నిర్వహించాల్సిన శిబిరం అనివార్య కారణాల వల్ల రద్దు చేశామని పేర్కొన్నారు. సదరం క్యాంపును ఈ నెల 27న నిర్వహిస్తామని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వేదికపై మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, డీఈవో వెంకటేశ్వర్లు

- జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి
- ఘనంగా మహిళా దినోత్సవం

మంచిర్యాలఅర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను డీఈవో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళలు, ఉపాధ్యాయినుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఉపాధ్యాయినులకు నిర్వహించిన ఆటలు టగ్ ఆఫ్ వార్, షాట్‌పుట్, పాటల పోటీల విజేతలకు జెడ్పీ చైర్‌పర్సన్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, సెక్టోరల్ అధికారి పద్మజ, పీఆర్‌టీయూ టీఎస్ గౌరవ అధ్యక్షురాలు శాంకరి, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు ఉమాదేవి, వైద్యురాలు స్వరూపరాణి, ధనలక్ష్మి, రాజేశ్వరి, అనురాధ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆటలపోటీలు నిర్వహించి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోబిన్, ఏవీ విలాస్, పీఈటీ రాజేందర్ పాల్గొన్నారు. రాష్ట్రీయ భాష హిందీ హైస్కూల్‌లో ఉపాధ్యాయినులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప, ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

మహిళల కోసమే ఆరోగ్య కేంద్రాలు

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ఆరోగ్య మహిళ క్లినిక్ ప్రారంభం



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: మహిళలు ఆరోగ్యకరంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసిందని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా క్లినిక్‌ను బుధవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలోని జన్నారం, బెల్లంపల్లిలోని తాళ్లగురిజాల, జైపూర్ మండలం కుందారం పీహెచ్‌సీ, జిల్లా కేంద్రంలోని బస్తీదవాఖానలో ఈ మహిళా ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. మహిళలకు ప్రతీ మంగళవారం ఎనిమిది రకాల వైద్య పరీక్షలు నిర్వహించి తదుపరి చికిత్సకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపిస్తారని అన్నారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. క్యాన్సర్ స్క్రీనింగ్ చేసి, అనుమానం, లక్షణాలు ఉన్న వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి, క్యాన్సర్ నిర్ధారణ జరిగితే చికిత్స అందిస్తారని అన్నారు. అనంతరం ఆరోగ్య మహిళా క్లినిక్ అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్ పోరెడ్డి రాజు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ మహిళా కౌన్సిలర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే రేఖానాయక్

మహిళా దినోత్సవం జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగాలు, వివిధ రంగాల్లోని మహిళలను సన్మానించారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కౌన్సిలర్లు మెరుగు మహేశ్వరి, సుంకరి శ్వేత, బొలిశెట్టి సునిత, హఫీజాబేగం, మహిళా కార్మికులను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శాలువాలతో సత్కరించారు. జన్నారంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొని కేక్ కట్ చేశారు.
- లోపలిపేజీల్లో...

మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న మధుసూదన్‌నాయక్

మంచిర్యాలఅగ్రికల్చర్: మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ, వృద్ధుల ఆశ్రమం ఆనంద నిలయానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరీంనగర్ ప్రాంతీయ కార్యాలయం ఒక కంప్యూటర్ అందజేశారు. 15మంది వృద్ధురాళ్లను సన్మానించారు. అనంతరం తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఐదు ఇన్వర్టర్లు, పోటీ పరీక్షల పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఇండియా కరీంనగర్ రీజినల్ హెడ్ అరుణ్‌కుమార్, ఏజీఎం వంశీకృష్ణ, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చందూరి మహేందర్, సాంఘిక సంక్షమ రీజినల్ కోఆర్డినేటర్ స్వరూపారాణి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

దహెగాం(సిర్పూర్): భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుమురంభీం జిల్లా దహెగాం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బీబ్రా గ్రామానికి చెందిన మీసాల శ్రీనివాస్(36) మంగళవారం సాయంత్రం మద్యం సేవించి భార్య సంగీతతో గొడవ పడ్డాడు. దీంతో భార్య పార్వతిపేటలోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ బుధవారం ఉదయం తన తమ్ముని కుమారుడైన సాత్విక్‌కు ఫోన్‌చేసి 'నేను ఉరేసుకుని చనిపోతున్నా.. మీ పెద్దమ్మకు చెప్పు' అని చెప్పి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాత్విక్ విషయాన్ని నానమ్మ వెంకిబాయికి చెప్పడంతో ఆమె ఇంటికి వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. వెంకిబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఎర్లవాడలో నివాసం ఉంటున్న గద్దం కిరణ్ (37)కు నాలుగేళ్ల క్రితం తాండూర్‌కు చెందిన రాజేశ్వరిని ప్రేమవివాహం చేసుకున్నాడు. క్యాటరింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దంపతుల మధ్య కలహాలు రావడంతో రెండేళ్లక్రితం రాజేశ్వరి పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు రావాలనికోరినా రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హోలీ వేడుకల్లో విషాదం

- పెద్దవాగులో మునిగి విద్యార్థి మృతి



అనిల్ కుమార్ మృతదేహం



అనిల్ కుమార్(ఫైల్)

ఆసిఫాబాద్: ఆ కుటుంబంలో హోలీ వేడుకలు విషాదాన్ని నింపాయి. వేడుకల్లో పాల్గొన్న విద్యార్థి స్నానానికి వెళ్లి పెద్దవాగులో పడి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని తారకరామనగర్‌కు చెందిన గాజుల గంగారెడ్డి, రజిత దంపతులకు కుమారులు అజయ్‌కుమార్, అనిల్‌కుమార్ (12) సంతానం. గంగారెడ్డి మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా తల్లి రజిత పిల్లలను పోషించుకుంటోంది. మంగళవారం చిన్న కుమారుడు అనిల్‌కుమార్ స్నేహితులతో కలిసి హోలీ ఆడుకున్నాడు. మధ్యాహ్నం స్నేహితులతో కలిసి పెద్దవాగుకు స్నానానికి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. బుధవారం సాయంత్రం పెద్ద వాగులో మృతదేహం లభ్యమైంది. తల్లి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ ఫలితాల కోసం..



కాంప్లిమెంటరీ బృందాలతో అవగాహన తరగతుల నిర్వహణ

- వందశాతం ఉత్తీర్ణతకు చర్యలు
- లక్ష్యం దిశగా మిషన్ కార్యక్రమం
- సత్ఫలితాలిస్తున్న అభ్యాస దీపికలు

ఉట్నూర్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే మిషన్ లక్ష్యం అమలు చేస్తుండగా విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన అభ్యాస దీపికలు అందించడంతో పాటు విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించింది. అంతేకాకుండా కాంప్లిమెంటరీ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలుండగా దాదాపు 34వేలకు పైగా గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో 3,851 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 1,735 మంది విద్యార్థులు, ఆసిఫాబాద్ జిల్లాలో 1,248 మంది విద్యార్థులు, నిర్మల్ జిల్లాలో 452 మంది విద్యార్థులు, మంచిర్యాల జిల్లాలో 416 మంది విద్యార్థుల చొప్పున హాజరు కానున్నారు.

ఫలితాల సాధనకు మిషన్ లక్ష్యం...

పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధనే లక్ష్యంగా ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గత డిసెంబర్ 7వ తేదీ నుంచి వందరోజుల మిషన్ లక్ష్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా వంద రోజుల పాటు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రతి రోజు ఉదయం గంట పాటు నాలెడ్జ్ అసిస్‌మెంట్, పరీక్షల నిర్వహణతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా పాఠ్యాంశాల వారీగా ప్రత్యేకంగా ప్రశ్నాపత్రాలు ముద్రించి గ్రేడ్‌ల వారీగా విద్యార్థులను విభజించి టెస్టులు నిర్వహించడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వారిని వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులను గ్రూపులుగా దత్తత ఇవ్వడం, కార్పొరేట్ స్థాయిలో జవాబు పత్రాలు ముద్రించి విద్యార్థులతో అభ్యసనం చేయించడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా అభ్యాస దీపికలు అందించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.



విద్యార్థులకు అందించిన అభ్యాస దీపికలు

కాంప్లిమెంటరీ బృందాలు..

ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఈసారి 11పేపర్లకు బదులుగా ఆరు పేపర్ల విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుండడంతో పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గిరిజన సంక్షేమశాఖ 14 కాంప్లిమెంటరీ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాల సభ్యులు విద్యార్థులకు పరీక్షా విధానం, నూతన మాదిరి ప్రశ్నాపత్రాలతో పరీక్షలు ఎలా రాయాలి, పరీక్ష రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను ఆశ్రమ పాఠశాలల వారీగా ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించాయి.

నిర్మాణ్ సంస్థ ద్వారా అవగాహన

పదో తరగతి అనంతరం విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు ఉన్నత విద్య కోసం ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించేందుకు ఎలా ముందుకు సాగాలి తదితర అంశాలపై పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు నిర్మాణ్ సంస్థ ద్వారా గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు.



నిర్మాణ్ సంస్థ ద్వారా అవగాహన కార్యక్రమాలు

పరీక్ష సామగ్రి... ప్రత్యేక మెనూ..

వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక మెనూ అమలు చేయడంతో పాటు సూపర్‌విజన్ తరగతుల సమయంలో విద్యార్థులు అలసిపోకుండా పాలు, స్నాక్స్, టీతో పాటు ప్రత్యేక పోషకాహారం అందించనున్నారు. అంతేకాకుండా పరీక్షలు రాసే ప్రతి విద్యార్థికి చేతి గడియారం, జామెట్రీ బాక్స్, పరీక్ష ప్యాడు, పెన్నులు, లాంగ్ స్కేల్‌లను ప్రత్యేకంగా అందించనున్నారు.

నిరంతరం పర్యవేక్షణ



వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో గిరిజన విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. మిషన్ లక్ష్యం అమలుతో పాటు ఇతర ప్రత్యేక చర్యల ద్వారా విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. అంతేకాకుండా భవిష్యత్‌లో ఉన్నత విద్యాభ్యాసన కోసం ఎలా ముందుకు సాగాలి తదితర అంశాలపై నిర్మాణ్ సంస్థ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– జగన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఐటీడీఏ

రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం



మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కావ్య

చెన్నూర్: పట్టణానికి చెందిన మద్దూరి కావ్య రాష్ట్ర స్థాయి పరుగుపందెం పోటీల్లో బంగారు పతకం సాధించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సిద్దిపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 5కే రన్ పోటీల్లో పాల్గొన్న కావ్య ప్రథమస్థానంలో నిలిచింది. బంగారు పతకంతో పాటు రూ.10 వేల నగదు పురస్కారాన్ని మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అందుకుంది. గోల్డ్‌మెడల్ సాధించిన కావ్యను గురుకృపా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి కారెంగుల రామయ్య అభినందించారు.

రేపు మినీ జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 10న శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహిరచనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీ కోసం బీటెక్ లేదా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత కలిగి 26 సంవత్సరాల వయస్సు కల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు మంచిర్యాల, హైదరాబాద్‌లలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కార్యాలయం లేదా 9111731173, 6304600392 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

యువతి మృతి

జైనథ్: మండలంలోని బెల్లూరికి చెందిన మార్శెట్టి బాపన్న, విఠాబాయిల చిన్న కూతురు మార్శెట్టి శ్రీలత (22) చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం... శ్రీలత తన అక్కా, బావలతో కలిసి మహారాష్ట్రలోని పాటన్‌కు పుట్టిన రోజు వేడుకల కోసం మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో అక్క భర్త తోట మహేష్‌తో కలిసి బైక్‌పై వస్తుండగా చీకటి పడడంతో రోడ్డుకు అడ్డంగా వచ్చిన పందిని బైక్ ఢీకొంది. శ్రీలత తల భాగంలో తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మంచిర్యాలటౌన్: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే



తాండూర్: చెక్కు అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



సభ్యురాలిని సన్మానిస్తున్న జీఎం దంపతులు

- ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- మహిళా ఉద్యోగులు, కార్మికులకు సన్మానం

మంచిర్యాలటౌన్: మహిళల ఆర్థికాభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా కౌన్సిలర్లు మెరుగు మహేశ్వరి, సుంకరి శ్వేత, బొలిశెట్టి సునిత, హఫీజా బేగం, మహిళా మున్సిపల్ కార్మికులను సన్మానించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 1,271 మహిళా సంఘాల సభ్యులకు రూ.4.09 కోట్ల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, మున్సిపల్ అకౌంట్స్ ఆఫీసర్ అనితా దేవి, అడ్వకేట్ డాక్టర్ చిదానంద కుమారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.ఉష, టీజీబీ మేనేజర్ గాయత్రి, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. తిమ్మాపూర్‌లో కార్యక్రమంలో సర్పంచ్ జాడి గంగాధర్, వార్డు సభ్యులు చంద్రయ్య, పాఠశాల హెచ్‌ఎంలు శ్రీనివాస్, సతీశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తాండూర్(బెల్లంపల్లి): మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సురభి గార్డెన్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులను కలెక్టర్ బాదావత్ సంతోష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 3,083 పొదుపు సంఘాలకు రూ.4.26 కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. అభయ హస్తం నగదును వడ్డీతో సహా మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ వడ్డీ లేని రుణాలు పొందిన మహిళలు స్వయం ఉపాధి కోర్సులను ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ గౌతమి, ఉత్తమ ఉపాధ్యాయురాళ్లు, మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, వైస్ ఎంపీపీ నారాయణ, జెడ్పీటీసీ బాన య్య, ఎంపీటీసీలు ఎస్.శంకర్, ఎం.శంకర్, పెర్క రజిత, యశోద, డీఆర్‌డీవో శేషాద్రి, ఏపీడీ శ్రీనివా స్, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ప్రభాకర్ , ఏపీఎం పోమానాయక్ , సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సాధించలేనిది ఏదీ లేదు

శ్రీరాంపూర్(మంచిర్యాల): మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీలేదని శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సేవా అధ్యక్షురాలు రాధాకుమారి అన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాపోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైద్యులు స్వప్న, ఇటీవల రిటైర్డ్ అయిన డీజీఎం గోవిందరాజు, ఉత్తమ సేవా కార్యకర్తలను సన్మానించారు. ఈ కా ర్యక్రమంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు, సేవా సెక్రటరీ కొట్టి జ్యోతి, సుధా, సూర్యలక్ష్మి, పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా పశువైద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పశువైద్యశాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ పశువైద్యాధికారి శంకర్, పశువైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంచాల భూమయ్య, ప్రధాన కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణి ప్రాంత మహిళల అభ్యున్నతి కోసం సింగరేణి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, సేవా సమితి అధ్యక్షురాలు లక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో బుధవారం మహిళా దినో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మ హిళలకు పలు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇస్తున్న ట్లు తెలిపారు. అంతకుముందు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదా నం చేశారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కాసిపేట గనిపై...

కాసిపేట:మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఏజెంట్ కుర్మ రాజేందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, స్వేరోస్ రాష్ట్ర కో కన్వీనర్ బన్న లక్ష్మణ్‌దాస్, ఇంజినీర్ గుగ్లోత్ బాబు, సంక్షేమాధికారి జీశాన్, పిట్ కార్యదర్శులు భైరి శంకర్, బియ్యాల వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్

జన్నారం(ఖానాపూర్): డీఎస్సీ 2003 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులు, అప్పటి ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ 2003 నోటిఫికేషన్ వెలువడ్డాక 2004 జనవరిలో నియామక ప్రక్రియ జరిగిందన్నారు. అప్పటికే సీపీఎస్ విధానం అమలులో ఉండడం వల్ల 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కూడా సీపీఎస్ విధానం అమలు చేయడం సబబు కాదన్నారు. వారి అభ్యర్థన మేరకు ఫిబ్రవరి 17, 2020లో కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈనెల 3న కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 31, 2023 లోగా వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో 16 వేల మంది ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఈ నెల 9 న జరిగే రాష్ట్ర కేబినేట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎం.నాగన్న, రాజయ్య, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

నేషనల్ హైవే పనులకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ రాజు

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలో జరుగుతున్న నేషనల్ హైవే రోడ్డు పనులకు ప్రజలు సహకరించాలని శ్రీరాంపూర్ సీఐ రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న ఐరన్ గ్రిల్స్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. జైపూర్ సెంటర్‌లో ఉన్న దుకాణాల యజమానులు, వాహనదారులు, గ్రామస్తులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ డీఈ అన్నయ్య, ఎస్సై రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బల్మూరి అరవిందర్‌రావు, నాయకులు ఆసంపల్లి రాజమల్లు, మద్దుల నర్సింహారెడ్డి, చినూరి రాజబాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీనెల 7లోగా వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న బోగె ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతీనెల 7లోగా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం గోలేటి సీహెచ్‌పీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో కాంట్రాక్టు కార్మికుల పాత్ర కూడా ఉందన్నారు. సీహెచ్‌పీ రైల్వే ట్రాక్ మెయింటనెన్స్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులను శ్రమదోపిడీకి గురిచేయకుండా కనీస వేతనాలు అందించాలన్నారు. రక్షణలో భాగమైన షూ, హెల్మెట్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు వెంకటేశ్, రాజన్న, పోచయ్య, అరవింద్, వినోద్, మారుతీ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో న్యాయసలహాలు

- యూట్యూబ్, ఫేస్‌బుక్‌లలో వీడియోలు
- చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అడ్వకేట్ అలీ



యూట్యూబ్‌లో అలీ చానల్

చెన్నూర్: చట్టం ఎవరికీ చుట్టం కాదు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందే. చట్టాలపై అవగాహన లేకపోవడంతో జనం న్యాయపరమైన చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న చెన్నూర్ పట్టణానికి చెందిన యువ లాయర్ జులిఫికర్ అలీ చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని నిర్ణయించుకున్నాడు. సామాజిక మాధ్యమాలను ఎంచుకున్నాడు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన చట్టాలపై అవగాహన వీడియోలకు లక్షలాది మంది నుంచి స్పందన లభించింది. ఫేస్‌బుక్, యూట్యూబ్, రైజింగ్ మోజ్, ఇన్‌స్టాగామ్‌లలో పదిలక్షల ఫాలోవర్స్‌ను సొంతం చేసుకున్నాడు.

పది లక్షల మంది ఫాలోవర్స్

మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణానికి చెందిన జులిఫికర్ అలీకి చిన్నప్పటి నుంచి న్యాయవాది వృత్తి అంటే మక్కువ. దీంతో ఉస్మానియా యూనివర్శిటీలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశాడు. హైకోర్టుతో పాటు లోయర్ కోర్టులలో క్రిమినల్ కేసులు వాదిస్తున్నాడు. ఎక్కువ మంది యువత చట్టాలపై అవగాహన లేక కేసుల్లో ఇరికి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని గుర్తించాడు. ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకుంటూనే చట్టాలపై అవగాహన కల్పిస్తూ వీడియో చేశాడు. మొదటి వీడియోకు మంచి స్పందన వచ్చింది. 4 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఫేస్‌బుక్‌తో పాటు మోజ్, యూట్యూబ్‌లలో వీడియోలు చేశాడు. అనతికాలంలోనే పది లక్షల మంది ఫాలోవర్స్‌ను సొంతం చేసుకున్నాడు.

కొంతమందికైనా మేలు..



నా వీడియోల ద్వారా కొంత మందికైనా మేలు జరిగితే సంతోషం. ఎవరైనా ఎప్పుడైనా న్యాయపరమైన సలహాలు, సూచనలు కావాలంటే ఉచితంగా ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నా. క్షణికావేశంలో తప్పులు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దు. చట్టాలకు విరుద్ధంగా ప్రవర్తించవద్దు.

– జులిఫికర్ అలీ, హైకోర్ట్ న్యాయవాది, చెన్నూర్

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



క్లినిక్ ప్రారంభిస్తున్న జక్కుల శ్వేత

బెల్లంపల్లి: మహిళల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లి మండలం తాళ్ల గురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా క్లినిక్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా మహిళలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి మహిళల ఆరోగ్యం కాపాడేందుకు మహిళా ఆరోగ్య క్లి నిక్‌లు ప్రారంభిస్తున్నారన్నారు. ఇందులో ప్రతీ మంగళవారం మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. మహిళల ఆరోగ్యం ఇంటికి శుభ సూచికమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోమాస శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, సర్పంచ్ రంజిత, ఎంపీటీసీ శకుంతల, డీడీఎంహెచ్‌వో విజయపూర్ణిమ, పీహెచ్‌సీ వైద్యులు అనీష్, ఎవెంజలిన్, హెచ్‌ఈవో సమ్మయ్య, వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.